ప్రజాశక్తి
మంగళవారం 25 నవంబర్ 2025
5

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు పట్టణం మాతా శిశు ఆసుపత్రి రక్తనిధి బ్యాంకులో సోమవారం ఎస్ హెచ్ జె ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో యువత, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సుమారు 30 మంది డోనర్లు హాజరు కాగా మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్రరావు బ్లడ్ డోనర్లను పరీక్షించి 16 మంది బ్లడ్ డొనేట్ చేయవచ్చు అని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ జె ఫౌండేషన్ ఫౌండర్ హర్ష జనపరెడ్డి మాట్లాడుతూ... తాను 23వ సారి బ్లడ్ డొనేషన్ చేశానన్నారు.యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్రరావు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది వెంకట్, అప్పారావు, చందు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-పాడేరు:తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా పాడేరు డివిజన్లోని సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తలారిసింగి గురుకుల కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాడేరు డివిజన్లోని 11 మండలాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ ధర్నా కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలపై నినాదాలు చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఉద్యోగుల అందరిని విద్యా శాఖలో విలీనం చేయాలని హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని హెచ్ఆర్ఏ, డిఏ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అవుట్సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో మార్పు చేసి మినిమం టైం స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎస్ఎస్సి ఉద్యోగులకు వర్తింపచేయాలని ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్లో డిఆర్ఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వగ్గు జయరాజు, జిల్లా ట్రెజరర్ పూజారి సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు పాడి పంతులు, కమిటీ సభ్యులు నారాయణ, సూర్య ప్రకాష్, బాలరాజు, వసంత కుమారి, హిమ బిందు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఉద్యోగులు

రైవాడలో కొనసాగిన గాలింపు

లభ్యంకాని ఇద్దరి ఆచూకీ

గాలిస్తున్న ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి-దేవరాపల్లి, అనంతగిరి:అనంతగిరి మండలం జీనబాడులో రైవాడ జలాశయంలో గల్లంతైన ఇద్దరి యువకుల కోసం చేపట్టిన గాలింపు చర్యలు సోమవారం రెండో రోజూ ఫలితం ఇవ్వలేదు. సోమవారం ఉదయం 6 గంటలకు ఏపీ ఎస్డిఆర్ఎఫ్ 23 మంది సిబ్బంది సీఐ టీ.రామకృష్ణ నేతృత్వంలో రెండు బృందాలుగా ఏర్పడి స్ట్రీమ్ బోట్లతో గంటల తరబడి జలాశయంలో గాలింపు చేపట్టినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఫారెస్ట్ రేంజర్, అనంతగిరి తహశీల్దార్ వెంకటాచారి, ఎస్సై డి.శ్రీనివాసరావులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆదివారం లభించిన జీవన్ మృతదేహానికి గ్రామంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. గాలి అప్పలరాజు, దబారి రమేష్ ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబాలు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు.కుటుంబ సభ్యుల ఆందోళనతో తహశీల్దార్తో కూడిన అధికార బృందం వారితో మాట్లాడి పరిస్థితిని శాంతింపజేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : గంగరాజు

కాశీపట్నం: రైవాడ జలాశయంలో గల్లంతయిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. సోమవారం అరకులోయ ఏరియా ఆసుపత్రిలో గల్లంతైన మృతదేహాల పోస్టుమార్టంను పర్యవేక్షించారు. పోస్టుమార్టం అనంతరం జడ్పిటిసి మాట్లాడుతూ, ప్రజలు తమ జీవనం కోసం ఎంతో ప్రమాద భరితమైన మార్గాలలో నిత్యం ప్రయాణం చేస్తున్నారని ఆయన తెలిపారు.

కొయ్యూరు మండల సమస్యలపై సమీక్ష

ప్రజాశక్తి-పాడేరు: కొయ్యూరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు పాడేరు డివిజన్ ఆర్డీఓ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షలో ముఖ్యంగా రెవెన్యూ, రీసర్వే పనులు, మీ కోసం గ్రీవెన్సులు, సివిల్ సప్లై అంశాలు, జాతీయ రహదారి 516 ఈ భూసేకరణ సమస్యలు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల జారీకి సంబంధించిన పెండింగ్ సమస్యలపై ఆర్డీఓ లోకేశ్వరరావు చర్చించారు. సరిగా పనిచేయని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ హెచ్చరించారు.

జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు విజయవంతం

ప్రజాశక్తి-పాడేరు:జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు తలారిసింగి, ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గిరిజన సంక్షేమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం నాగేశ్వరరావు, కె.ప్రసాద్లు హాజరై మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, ప్రజలంతా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన చెకుముకి జిల్లా స్థాయి పోటీలలో పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉన్న 11 మండలాల నుండి మండల స్థాయిలో గెలు పొందిన 14 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగము నుండి అనంతగిరి ఏకలవ్య పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల విభాగము నుండి పెదబయలు సెయింట్ ఆన్స్ పాఠశాలలు గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఈ రెండు పాఠశాలలకు చెందిన విద్యార్థులు డిసెంబర్ 21 నుండి 23 వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలకు హాజరు కావాలని జెవివి అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య తెలియజేశారు. మండల స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయిలో పాల్గొన్న విద్యార్థులందరికీ ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. జిల్లా స్థాయిలో చెకుముకి సంబరాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న సంఘాల నేతలు

పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి హుకుంపేట:-మండల కేంద్రంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వెనుకభాగంలోని ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమిస్తున్నారని పత్రికల్లో వచ్చిన కథనంపై తహసిల్దార్ శ్రీనివాస్ స్పందించారు. సోమవారం ఆయన వెలుగు కార్యాలయాన్ని సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమాలకు గురైతే రికార్డులను పరిశీలించి తక్షణ చర్యలు చేపడతామన్నారు. అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలపై రాజీ ఉండదని స్పష్టం చేశారు. పూర్వపరాల రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. తహసిల్దార్ విలేకరులకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అక్రమాలను తొలగించి, ఆ స్థలాన్ని వెంటనే విలేకరులకు అప్పగించేందుకు రేవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, విఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన అంగన్వాడీ భవనం పరిశీలన

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-అరకులోయరూరల్: శరభగూడలో నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించక పోవడంపై ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 22న ప్రచురితమైన అప్పగింతలో ఆలస్యమెందుకో కథనానికి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ లక్ష్మీ లావణ్య స్పందించారు. నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని పరిశీలించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సి హెచ్ లక్ష్మీ లావణ్య తెలిపిన వివరాల ప్రకారం శరభగూడ అంగన్వాడీ కేంద్ర స్వంత భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ టాయిలెట్ నిర్మాణం పెండింగ్లో ఉందన్నారు.గుత్తేదారుడుకు బిల్లులు బకాయి ఉండటంతో పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికీ భవనం అధికారికంగా అప్పగించలేక పోతున్నట్లు డివిజినల్ ఇంజనీర్ తెలిపారన్నారు. టాయిలెట్ పనులు పూర్తయి, బకాయిలు చెల్లించగానే భవనం స్వాధీనం చేసుకోవడం జరుతుందన్నారు. భవనం అందుబాటులోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాన్ని స్వంత భవనంలోకి మార్చుతామని పేర్కొన్నారు.ఈ సమాచారాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు కూడా నివేదించినట్లు తెలిపారు.

భవనాన్ని పరిశీలిస్తున్న ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి

26 నుంచి ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర

ప్రజాశక్తి-కాశీపట్నం:రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ప్రకారం షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, రంపచోడవరం కేంద్రంగా మరో ఆదివాసి జిల్లా ఇవ్వాలని ఈ నెల 9న చింతూరులో మొదలైన ఆదివాసి సత్యాగ్రహ యాత్ర ఈ నెల 26 నుండి అనంతగిరి మండలంకు చేరుతుందని జేఏసీ కన్వీనర్ పాంగి రవీంద్ర,కో-కన్వీనర్ బి చంటిబాబు, భారత్ ఆదివాసి పార్టీ అరకు నియోజకవర్గ ఇన్-ఛార్జ్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 27న అరకులోయ, డుంబ్రిగూడ మండలాలలో కొనసాగుతుందని తెలిపారు.

ఈ రహదారికి మోక్షమెప్పుడు ?

- అధ్వానంగా పెద్దమట్టపల్లి నర్సింగ్పేట రోడ్డు
- వైసిపి ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన
- టేకులూరు రహదారిదీ అదే పరిస్థితి
- అవస్థలు పడుతున్న ఆయా గ్రామస్తులు

రాళ్లు తేలిన పెద్దమట్టపల్లి నర్సింగ్పేట రహదారి



వైసిపి హయాంలో శంకుస్థాపన చేసినప్పుడు వేసిన శిలాఫలకం

ప్రజాశక్తి-విఆర్పురం : మండలంలోని పెద్దమట్టపల్లి నుండి నర్సింగ్పేట వరకు15.2 కిలోమీటర్ రోడ్డుకు 4.33 లక్షల రూపాయలు వైసిపి హయాంలో మంజూరు చేశారు. మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శంకుస్థాపన చేసి రోడ్డు తవ్వి వదిలేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మమ్మల్ని గెలిపిస్తే అధికారంలోకి రాగానే రోడ్డు పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వ నాయకులు హామీలు ఇచ్చారని ప్రస్తుతం రోడ్డు పనుల ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మట్టపల్లి నుండి కుందులూరు మీదుగా టేకులూరు వరకూ ఉన్న రోడ్డు కూడా అధ్వానంగా తయారైందని, అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదని నిత్యావసర సరుకులకు వెళ్లాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రహదారి నిర్మించాలని ఐటిడిఏకి ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మించాలని లేని పక్షంలో ఐటిడిఎ ముందు దీక్ష చేపడతామని హెచ్చరించారు.

అన్నవరం వాగు వద్ద నిర్మించిన తాత్కాలిక వంతెన

తాత్కాలిక వంతెనే గతి..

ప్రజాశక్తి- విఆర్పురం: అన్నవరం వాగు వద్ద తాత్కాలిక దారి మూడోసారి వేశారు. గడిచిన ఆరు నెలలు పాటు ఇక్కడ దారి లేక గిరిజనులు, వాహన చోదకులు, విద్యార్థులు , రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అఖిలపక్షం ఆధ్వర్యం లో ప్రజలు ఉద్యమించటంతో అధికారులు స్పందించి ఎట్టకేలకు అన్నవరం వాగు వద్ద తాత్కాలిక డ్రైవర్స్ నిర్మించారు. జూన్ కల్లా ఇక్కడ శాశ్వతంగా పిల్లర్స్ తో బ్రిడ్జిని నిర్మించాలని లేకపోతే మళ్లీ వాగు ఉధతికి కొట్టుకుపోవడం షరా మామూలే అవుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ స్మరణ్రాజ్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై వచ్చిన వినతులకు పరిష్కారం చూపుతున్నామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్రాజ్ తెలిపారు. సోమవారం ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పిఒ స్మరణ్రాజ్ మాట్లాడుతూ ఈ వారం సుమారు 85 వినతులు వచ్చాయని, వినతులు పూర్తి స్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను అయన ఆదేశించారు.

24 గంటలూ అందుబాటులో ఉంటా !

- వైద్యాధికారి పసుపులేటి నారాయణరావు
- పలువురు సన్మానం

ప్రజాశక్తి -సీలేరు: రోగులకు వైద్యసేవలందించేందుకు 24 గంటలూ అందుబాటులో ఉంటానని వైద్యాధికారి పసుపులేటి నారాయణరావు స్పష్టం చేశారు. జికె వీధి మండలం సీలేరు పిహెచ్సిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారి పసుపులేటి నారాయణరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు డి.స్వర్ణలత, వైసిపి టౌన్ అధ్యక్షుడు పేలూరి సత్యనారాయణ వెల్లడించారు. అనంతరం ఆయనను దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ రోగులకి వైద్యసేవలు అందించాలని వైద్యాధికారిని కోరామన్నారు. ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా బొడ్డగండి పంచాయతీ బచ్చులూరు తెలుగు క్యాంపు దుప్పిలివాడ పంచాయతీ పరిధి శాండికోరి, బూసికొండ, కొమ్ములవాడ, చల్లనిశిల్ప, జొన్నమామిడి, గ్రామాల నుంచి అధికశాతం మంది రోగులు వైద్యసేవలు పొందడానికి వస్తుంటారని ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి రోగులకు వైద్యసేవలు అందించడానికి 24 గంటలూ అందుబాటులో ఉంటానని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారన్నారు. తాను డిప్యూటేషన్ ప్రాతిపదికన కలెక్టర్, డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు సీలేరు పిహెచ్సిలో బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి సృజనారాయ్, హెల్త్ సూపర్వైజర్ త్రినాధ, వైద్యసిబ్బంది వైసిపి నాయకులు వెంకటరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారిని సన్మానిస్తున్న నాయకులు

బడి.. మూతబడి..

తాళం వేసి ఉన్న తరగతి గది

తరగతి గది వద్ద ఆడుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ఇసుకపట్ల గ్రామంలో ఉన్న ఎంపిపి పాఠశాల తరగతి గదికి తాళం వేసి ఉంది. ఉపాధ్యాయులెవరూ రాలేదు. ఉదయం పాఠశాలకు వచ్చిన 36 మంది విద్యార్థులు తరగతి గదికి తాళం వేసి ఉండడంతో కొంతసేపు ఆడుకుంటూ అక్కడే గడిపారు.

మధ్యాహ్నం వరకు ఎదురు చూసి మధ్యాహ్న భోజనం చేసి ఇళ్లకు వెళ్లిపోయారు. పాఠశాలకు ఉపాధ్యాయులు ఏ కారణంతో రాలేదన్న విషయంపై స్పష్టమైన సమాచారం లేదు.

అగ్నిప్రమాద బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని, అమ్మిరేకుల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో చుంద్రు రాజుబాబు ఇల్లు దగ్ధమైంది. సోమవారం పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు అతనిని పరామర్శించారు. బడదనాంపల్లి సర్పంచ్ లక్ష్మీ దుర్గా, రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, పీసా కమిటీ వైస్ ప్రెసిడెంట్ గొల్లపూడి సత్తిబాబు, మాజీ ఎంపిటిసి దొడ్డం రెడ్డి చిన్నతల్లి, టిడిపి నాయకులు నీలాద్రి అబ్బులు, గంగరాజు, దొడ్డంరెడ్డి శివప్రసాద్, తదితరులు రాజుబాబుకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, కొంత ఆర్థిక సాయం అందజేశారు. మరింత సాయం అందజేసేందుకు కృషి చేస్తామన్నారు.

నగదు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

బస్సు సర్వీసులు పునరుద్ధరణ

ప్రజాశక్తి-సీలేరు: మావోయిస్టులు తలపెట్టిన నిరసన దినం నేపథ్యంలో పోలీసులు ఆదేశాల మేరకు విశాఖపట్నం డిపోకు చెందిన బస్సులు అధికారులు రద్దు చేసిన విషయం తెలిసిందే. నిరసన దినం ప్రశాంతంగా ముగియడంతో సోమవారం రాత్రి నుంచి తిరిగి విశాఖపట్నం ఆర్టీసీ డిపో నుంచి విశాఖ వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్తో పాటు విశాఖ - సీలేరు నైట్ హాల్ట్, పగటిపూట తిరిగే విశాఖ వయా సీలేరు భద్రాచలం వెళ్లే బస్లను పునరుద్ధరించామని డిపో మేనేజర్ మాధురి తెలిపారు. ప్రయాణికులు రిజర్వేషన్ కూడా పొందవచ్చునని ఆమె తెలిపారు.

నగదును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కలెక్టర్ చేయూత

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం కొయ్యూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సరమండ లక్ష్మి అనే మహిళకు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ చేయూతనందించారు. సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న ఆమెకు జీవనోపాధి నిమిత్తం కలెక్టర్ స్వయంగా మిషన్ను అందజేశారు.

పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నంద శ్రీ మోదమాంబ విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న సిహెచ్. మోహిత్ సాయి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ విలువిద్య పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచి, రాష్ట్ర తరపున విలువిద్య సబ్ జూనియర్ కేటగిరిలో జాతీయస్థాయిలో పాల్గొనుటకు నవంబర్ 28 నుండి డిసెంబర్ 1 వరకు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఈటానగర్ లో పాల్గొనుటకు జిల్లా కలెక్టర్ వారు ఆర్థిక సాయం అందించారు. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శనలు కనబరిచి రాష్ట్రం తో పాటు జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్ రావు, కోచ్ అడపా. సుధాకర్ నాయుడు (ఎస్ ఎస్ ఎస్ ఐఎస్) పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పట్నాయక్

పార్టీ పటిష్టతకు కృషి

- ఎఐసిసి అబ్జర్వర్ పట్నాయక్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: కాంగ్రెస్ పార్టీని మరింత క్రియాశీలంగా మార్చడమే లక్ష్యమని అందులో భాగంగానే జిల్లా కాంగ్రెస్ కమిటీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా అన్ని జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల స్థాయిలో మార్పులు తీసుకురావాలని ఎఐసిసి నిర్ణయించినట్లు ఆబ్జర్వర్ దెబసిస్ పట్నాయక్ తెలిపారు. సోమవారం అకులోయ మండల కేంద్రంలోని అక్షయ ఇన్ రిసార్ట్లో డిసిసి అధ్యక్షుడు శతక బుల్లిబాబు ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి మీడియా సమావేశంలో ఏఐసిసి ఆబ్జర్వర్ దెబసిస్ పట్నాయక్ మాట్లాడారు.ప్రజా సేవలో నిస్వార్థంగా పనిచేసే నాయకులను గుర్తించేందుకు ఈ కొత్త ప్రక్రియ రూపొందించినట్లు పట్నాయక్ పేర్కొన్నారు.రికమండేషన్లు వ్యక్తిగతంగా కాకుండా, జిల్లాలో కనిపించిన వాస్తవిక పనితీరు ఆధారంగానే జరుగుతాయని స్పష్టం చేశారు. అల్లూరి,మన్యం పార్వతిపురం జిల్లాలో నియోజకవర్గలో పాడేరు, రంపచోడవరం, కురుపం, మన్యం పార్వతిపురం,పాలకొండ, సాలూరు,ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, స్థానిక నాయకుల నుండి సుమారు 12 రకాల సమాచారం సేకరించే ప్రక్రియ మొదలు పెడతామని చెప్పారు.ప్రతి జిల్లాలో సమీక్ష పూర్తయ్యాక, కొత్త సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన జాబితాను పార్టీ విడుదల చేయనున్నట్లు పట్నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో పిసిసి ఇంచార్జీ వేగి వెంకటేశ్, ఆదివాసి స్టేట్ కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు, అరకు అసెంబ్లీ ఇంచార్జ్ చెట్టి గంగాధర్ స్వామి, కాంగ్రెస్ కిసాన్ కమిటి సభ్యుడు పాంగి గంగాధర్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మోస్య ప్రేమ్ కుమార్, ఓబిసి జిల్లా చైర్మన్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మన్యం బంతిపూలకు గిరాకీ

పాడేరు కేంద్రంగా క్రయ విక్రయాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యంలో సహజ సిద్ధంగా పండించే బంతిపూలకు తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇతర ప్రాంతాల్లో పండించే పూలు కోసిన రెండు, మూడు రోజుల్లో వాడి పోతాయి. సకాలంలో రవాణా చేయకపోతే వర్తకులు నష్టపోతారు. అదే మన్యం బంతిపూలు కోసిన రెండు, మూడు రోజులకు గాని వాడిపోవు. బంతిపూల సీజన్ కావడంతో ఇరు రాష్ట్రాల వ్యాపారులు గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. పూల అమ్మకాల ద్వారా గిరి రైతులు ఆదాయం పొందుతున్నారు.

రాష్ట్రంలోని విజయవాడ, ఒంగోలు, రాజమండ్రి ప్రాంతాల్లో అక్కడి వ్యాపారుల ఆర్డర్ మేరకు ఇక్కడి వ్యాపారులు గిరిజన రైతుల నుంచి భారీగా బంతిపూలను కొనుగోలు చేస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభమైన నాటి నుంచి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పాత బస్టాండ్ అంబేద్కర్ సెంటర్ లో పూల వ్యాపారం ఊపందుకుంది. బుట్ట పూలను డిమాండ్ బట్టి రూ.100 నుంచి రూ.150కు గిరిజన రైతుల వద్ద వర్తకులు వాటిని కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లాలోని పాడేరు మండలం తో పాటు ఆనుకుని ఉన్న జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు మండలాల్లో రైతులు ప్రతి ఏడాది అధిక విస్తీర్ణంలో బంతిపూలను సాగు చేస్తుంటారు. అక్టోబర్ రెండో వారం నుంచి దాదాపుగా డిసెంబర్ మొదటివారం వరకు బంతిపూల క్రయవిక్రయాలు పాడేరులో ప్రతి శుక్రవారం జరిగే మార్కెట్లో జరుగుతుంటాయి. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం, తుని, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు చెందిన వర్తకులు ఇక్కడికి వచ్చి వాటిని కొనుగోలు చేసి, బస్తాల్లో ప్యాక్ చేసి, ఆయా ప్రాంతాలకు వాహనాల్లో రవాణా చేసుకుంటారు.

పాడేరులో అమ్మకానికి తీసుకొచ్చిన బంతిపూలు

రోడ్డుపైకి ప్రవహిస్తున్న మురుగునీరు

డ్రైనేజీ అస్తవ్యస్తం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకువేలీ మండలం పద్మాపురం పంచాయతీ పరిధిలోని దుమ్మగూడ గ్రామంలో మురుగునీరు సమస్య తీవ్రమైంది. గ్రామంలోని ప్రధాన రహదారులపై డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా మూసుకు పోవడంతో మురుగునీరు రోడ్లపై పొంగి పొర్లుతోంది. తరచూ చెత్త, మట్టి పేరుకు పోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్యపై పంచాయతీ ఉప సర్పంచ్ జన్ని భగత్ రాం మాట్లాడుతూ, గ్రామంలో డ్రైనేజీ నిండిపోయి మురుగునీరు బయటకు వస్తున్న విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రోడ్డంతా మురుగునీరు చేరడంతో గ్రామస్తులు రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడిందని నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గిరిబాలలకు ఉన్ని దుస్తుల పంపిణీ

ఉన్ని దుస్తులు పంపిణీ చేస్తున్న రైల్వే సిబ్బంది

ప్రజాశక్తి - చింతపల్లి: శీతాకాలంలో చలి నుంచి గిరిజన చిన్నారులు ఉపశమనం పొందేందుకు అవసరమైన ఉన్ని దుస్తులను కాకినాడకు చెందిన దక్షిణ మధ్య రైల్వే సిఅండ్‌డబ్ల్యూ సిబ్బంది సోమవారం పంపిణీ చేసినట్లు బిసిసెల్ అధ్యక్షులు లక్కోజి నాగభూషణం తెలిపారు. ప్రస్తుతం శీతాకాలంలో చింతపల్లి ఏజెన్సీ పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది ముందుకు వచ్చి, చింతపల్లి పంచాయతీ పరిధిలోని కందులగది, గూడెం మండలంలోని తీములబంద, ఊబపాలెం గ్రామాల్లోని 50 మంది చిన్నారులకు స్వెటర్లు, దుప్పట్లు, రగ్గులు వంటి ఉన్ని దుస్తులను స్వయంగా అందజేశారు. శీతాకాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పేద చిన్నారులకు ఉపశమనం కల్పించాలన్న సంకల్పంతో సేవాభావంతో వారికి ఉన్నిదుస్తులను అందజేసినట్లు తెలిపారు. దక్షిణమధ్య రైల్వే సిబ్బందికి గ్రామ ప్రజల తరఫున, తన తరఫున నాగభూషణం కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో పి. సత్యప్రసాద్, రాజుబాబు, ఎవి.రావు, ఈశ్వర్‌రెడ్డి, ఫణీంద్ర యాదవ్, ఎల్ఎస్. గోవింద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సాంకేతికతను మెరుగు పరచాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి గ్రామాల్లో సాంకేతికతను మరింత అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ లో మూడు ఐటిడిఏ పిఓలు, సబ్ కలెక్టర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, మండల రెవెన్యూ అధికారులతో వర్చువల్ గా వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు ముడిపడి ఉన్నటువంటి సాంకేతిక సమస్యలను అధిగమించడానికి సెల్ టవర్ లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. సెల్ టవర్ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. సెల్ టవర్ నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించాలని, భూ సమస్యలను అధిగమించడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనువైన ప్రదేశాలు లేని చోట అటవీ శాఖ పర్మిషన్‌తో అటవీ స్థలాలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్, జియో ఎయిర్టెల్ టవర్ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం ఐటిడిఏ పివో స్మరణ్ రాజ్, చింతూరు ఇంచార్జ్ ఐటిడిఏ పివో శుభం నొఖ్వాల్, పాడేరు ఇంచార్జ్ ఆర్‌డివో ఎస్ వివిఎస్. లోకేశ్వరావు, సర్వీస్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన

వినతిపత్రాన్ని ఇస్తున్న విఆర్ఎలు

ప్రజాశక్తి-పాడేరు:తమ సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపుతో భాగంగా చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో అల్లూరి జిల్లా సిఐటియు సహాయ కార్యదర్శి ఎల్. సుందరరావు, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు బి.కొండబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం వచ్చి 16నెలలు గడిచినప్పటికి తమ సమస్యలు పరిష్కరించలేదని, అనేకసార్లు అధికారులకు వినతిపత్రాన్ని ఇచ్చినా హామీలను అమలు చేయలేదన్నారు. వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని. వీఆర్వోగా, రికార్డ్ ఆసిస్టెంట్ లుగా ప్రమోషన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి నామినిలుగా పనిచేస్తున్న వారికి వీఆర్ఏలుగా నియమించాలని, అటెండర్, నైట్ వాచ్మెన్‌లకు ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70 శాతం పెంచాలని, అక్రమ డ్యూటీలు రద్దు చెయ్యాలన్నారు. రీ సర్వే పేరుతో ఇతర గ్రామాలకు డ్యూటీ రద్దు చేయాలన్నారు. ఆర్డిఓ కార్యాలయంలో ఏవోకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, రామకృష్ణ నీలకంఠం, కృష్ణంరాజు, సత్తిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

హల్దీ కుంకుమ్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన పెన్మత్స లలితావాశిష్ట 2006లో తెలుగులో రచించిన ఊయల కథా సంపుటికి రేగులగెడ్డ వెంకటలక్ష్మి గాయత్రి హిందీలోకి అనువదించిన హల్దీ కుంకుమ్ పుస్తకాన్ని సోమవారం పౌర గ్రంథాలయంలో ప్రముఖులు ఆవిష్కరించారు. సభాధ్యక్షులు పెన్మత్స లలితావాశిష్ట మాట్లాడుతూ, ఊయల కవితా సంపుటి హిందీలో హల్దీ కుంకుమ్‌గా రావడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పీసపాటి గిరిజ రాజ్యలక్ష్మి సమాఖ్య నివేదికను చదివి వినిపించారు.

జాబ్‌మేళాలో 180 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 180మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. వివిధ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఎంపిక పరీక్షలు నిర్వహించారు ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై నగరాలలో పనిచేయాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. బ్లింకెట్, స్విగ్గీ తదితర సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొన్నట్లు తెలిపారు. మంచి నైపుణ్యాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి కళాశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులనుకోరారు. ఎంపికైన వారికి నెలకు రూ.12వేలు నుంచి రూ.22 వేల వరకు వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బికె, జెఎకె, సంతోషి, లీలా పావని తదితరులు పాల్గొన్నారు. జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అభినందించారు.

జాబ్‌మేళా నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

వరి కోతలు కోస్తున్న రైతులు

ఏజెన్సీలో మొదలైన వరి కోతలు

ప్రజాశక్తి-విఆర్‌పురం: ఏజెన్సీలో వరి కోతలు ప్రారంభమ య్యాయి. మండలంలోని చింతలేగుపల్లి, ప్రతిపాక, కుందులూరు, తెల్లవారు గూడెం, పెద్దమట్టపల్లి, చిన్నమట్టపల్లి, రేఖపల్లి తదితర గ్రామాల్లో గిరిజన రైతాంగం ముమ్మరంగా వరి కోతల్లో నిమగ్నమయ్యారు. వరి కొంతమేర ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇతర పంటలు ఈ ఏడాది ఆలస్యంగా నాటడంతో ఇంకా సమయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

డిఎవి స్కూల్ గ్రౌండ్‌లో కురుస్తున్న మంచు

దట్టమైన మంచుతో అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో సోమవారం ఉదయం అధికంగా మంచు కురిసింది. నెల రోజుల నుంచి చలి,మంచు తీవ్రతతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. గత రెండు మూడు రోజుల నుంచి చలి, మంచు తీవ్రత తగ్గు ముఖం పట్టింది. దీంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. మళ్లీ వాతావరణంలో ఒక్కసారి మార్పులు చోటు చేసుకుని సోమవారం ఉదయం దట్టమైన మంచు కురిసింది. దీంతో పాటు చలి తీవ్రత కూడా అధికం కావడంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అగ్నివీర్‌కు గిరిజన యువకుడు ఎంపిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో చికిలింత పంచాయతీ, కరుదేపాలెం గ్రామానికి చెందిన గిరిజన యవకుడు రాయికన్నారెడ్డి అగ్నివీర్ నియామక ప్రక్రియలో విజయం సాధించిన జిల్లాలోని ఏకైక గిరిజన విద్యార్థిగా నిలిచాడు. అతను ఎంపిక కావడంపై తండ్రి మంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. డిసెంబర్ 10వ తేదీన బెంగళూరులో జరగనున్న శిక్షణలో పాల్గొంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లూరి జిల్లాలో ఒక గిరిజన యువకుడు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

రాయికన్నారెడ్డి

ఇకపై ఫోన్‌పేలో ట్రాఫిక్ చలానా చెల్లింపు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: వాహనదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఉల్లంఘన చలానాలు చెల్లించే విధానాన్ని విశాఖపట్నం ట్రాఫిక్ పోలీసులు మరింత సులభతరం చేశారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇకపై వాహనదారులు తమ మొబైల్‌లోని ఫోన్‌పే ద్వారా కేవలం కొన్ని సెకన్లలోనే తమ చలాన్లను చెల్లించుకోవచ్చు అన్నారు. ఇంతకుముందు వాహనదారులు చలానాలు చెల్లించడానికి ఎంపరివహన్ యాప్‌లో కొంత సమయం పట్టేది. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి, ఫోన్ పే యాప్‌లో ప్రత్యేకంగా ఈ-చలన్ అనే కొత్త ఐకాన్‌ను ఎనేబుల్ చేయడం జరిగిందని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ దినేష్‌కుమార్
- పలు చోట్ల రైతన్న మీకోసం

రాజబమ్మంగి : కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-హుకుంపేట: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని సూకూరు పంచాయతీ బెరిసింగిలో నిర్వహించిన 'రైతన్న మీకోసం'లో ముఖ్య అతిథిగా సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల సమస్యలను గ్రామంలోనే తెలుసుకుని పరిష్కారం అందించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే ఐదు కీలక అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. నీటి భద్రత, సాగునీటి వనరుల పెంపు, ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను రైతులు పండించేలా మార్గనిర్దేశం చేయాలన్నారు.రాబోయే రెండు సంవత్సరాల వ్యవసాయ ప్రణాళికలను గ్రామాల వారీగా తయారు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రైతుల అభిప్రాయాలు, సమస్యలను తక్షణమే నమోదు చేసి పరిష్కారానికి పంపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నందు, మండల వ్యవసాయ అధికారి సుధాకర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సర్పంచ్ ధనసాని సత్యవతి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:మండలంలోని పోతంగిలో స్థానిక టిడిపి నాయకులు సోమవారం రైతన్న మీకోసం చేపట్టారు. గిరి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కనీస వేతనాల సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ టి.సుబ్బారావు మాట్లాడుతూ, వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలతో విత్తనాలు ఇవ్వడంతో పాటు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ ఎంపీపీ ధన్నిరావు, మాజీ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కె.భాస్కరరావు, టిడిపి పంచాయతీ అధ్యక్షుడు ఎం భీమరాజు పాల్గొన్నారు.

గంగవరం: రైతన్న మీ కోసం కరపత్రాలు ప్రదర్శిస్తున టిడిపి నాయకులు

కాశీపట్నం: అనంతగిరి మండలం కొత్తూరు పంచాయితీ గ్రామాల్లో రైతన్న మీ కోసంలో భాగంగా అరకు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్, ఆర్టీసి విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం కర్షకులకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఏడాదికి రూ.20000 అర్హులైన ప్రతి రైతుకి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. వారం రోజులు అన్నదాత సుఖీభవ వారోత్సవాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సారా సీతయ్య, మండల అధ్యక్షులు సోవేరి సుబ్బారావు, ఉపాధ్యక్షులు మజ్జి భీమరాజు, కాశీపట్నం సన్యాసిరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కృష్ణ, సింహాచలం, ప్రధాన కార్యదర్శిలు సన్నిబాబు, తిరుపతి, కృష్ణ, బూత్ ఇన్-ఛార్జ్ వెంకటేష్, వీరభద్రరావు, టిఎన్ఎస్ఎఫ్ అరకువేలి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కిల్లో సిద్దేశ్వరరావు, అరకు నియోజకవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ బాలుదొర పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని లక్ష్మీపురం పంచాయతీలో కర్లపొద్దర్, మాకవరం సచివాలయ పరిధిలోని మాకవరంలో రైతన్న మీకోసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల పంట వివరాలు, ప్రస్తుతం దిగుబడులు, పంట మార్పిడిపై అవగాహన కల్పించాలన్నారు. జీవన ఎరువులతో ఉపయోగాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కొత్తడాలోని రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి విశ్వనాథం తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సమక్షంలో రైతన్న మీ కోసం టీమ్ ప్రతి ఒక్క రైతు ఇంటింకీ వెళ్లి 5 కుటుంబాలను ఒక క్లస్టర్‌గా తీసుకొని సర్వే చేపట్టామన్నారు. ఇందులో రైతు అభివద్ధి కోసం 5 సూత్రాలను రైతులకు వివరించామన్నారు. ఎంపిపి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇ పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ రైతుసేవా కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలన్నారు. జెడ్‌పిటిసి బేబీరత్నం, సొసైటీ అధ్యక్షులు పాముఅర్జున్ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, వైస్‌ఎంపిపి గంగాదేవి, ఎంపిటిసి ఆదినారాయణ, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వి.ఆర్.పురం : రైతుల సంక్షేమం కోసం రైతన్న మీ కోసం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ ఇమాన్యుయెల్, టిడిపి అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ తెలిపారు. 24 నుంచి 29 వరకూ రైతన్న మీ కోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 5 విధానాలతో కూడిన వివిధ అంశాలపై రైతులకు వివరించాలన్నారు. రైతులు, అధికారులు, పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని రైతన్న మీకోసం కార్యక్రమం ప్రారంభమైంది. గింజర్తిలో సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు, వ్యవసాయాధికారి చక్రధర్, మాజీ సొసైటీ అధ్యక్షులు గుణజాల తాతారావు, కూటమి నేతలు వీరబాబు, మల్లికార్జునరావు, రాజారత్నం, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు. పంచసూత్రాలు చదివి రైతులకి వినిపించారు. రాబోయే రబీలో ఏదో ఒక పంట వేసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా మినుములు, నువ్వులు అందిస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కరపత్రాలను రైతులకు అందజేశారు.

హుకుంపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కాశీపట్నంలో అన్నదాత సుఖీభవ పత్రాన్ని ఇస్తున్న దొన్నుదొర

ఒయాసిస్ ఫెర్టిలిటీ కృషి అభినందనీయం

ఎమ్మెల్యేలు గంటాశ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: ఓయాసిస్ ఫెర్టిలిటీ కృషి అభినందనీయమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. రెండో విడత 'ఓయాసిస్ జనని యాత్ర' కార్యక్రమాన్ని విశాఖపట్నంలో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ ఫెర్టిలిటీపై శాస్త్రీయ సమాచారం పట్టణాలు, గ్రామాల్లోకి చేరినప్పుడు భయం, అపోహలు తొలగిపోతాయన్నారు. డాక్టర్ పొట్లూరి రాధిక (రీజినల్ మెడికల్ హెడ్, ఓయాసిస్) మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా స్థానిక సముదాయాలకు సంతానోత్పత్తి (ఫెర్టిలిటీ) ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, తద్వారా తల్లిదండ్రులు కావాలనే ఆశ దిశగా మొదటి అడుగు వేయడానికి సహాయపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, వంధ్యత్వం అనేది కీలకమైన ప్రజాఆరోగ్యసమస్యగా మారుతోందన్నారు. 'ఓయాసిస్ జననియాత్ర' ప్రచారంలో భాగంగా, ఆధునిక సాంకేతికతతో కూడిన ఫ్రీ మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్ విశాఖ నుంచి టియర్-2 టియర్-3 పట్టణాల్లో ప్రయాణించి ప్రజలకు సేవలందిస్తుంది. ఈ మొబైల్ క్లినిక్‌లో అనుభవజ్ఞులైన ఫెర్టిలిటీ నిపుణులు, ఉచిత కన్సల్టేషన్లు. మహిళలకు ఉచిత ఏఎంహెచ్ హిమోగ్లోబిన్ పరీక్షలు, పురుషులకు ఉచిత వీర్యపరీక్ష, పరిశుభ్రమైన శాంపిల్ కలెక్షన్ జోన్లు అందుబాటులో ఉంటాయన్నారు. యాత్ర ప్రారంభోత్సవంలో భాగంగా, వాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఓయాసిస్ సంస్థ సిఈఒ పుష్కరాజ్ షెనై , ఓయాసిస్ సంస్థ మెడికల్ డైరెక్టర్ కో-ఫౌండర్ డాక్టర్ దుర్గా జీరావు తదితులు పాల్గొన్నారు.

షూటింగ్ షురూ..!

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై శివ నిర్మాణ దర్శకత్వంలో మాస్ మహరాజా హీరో రవితేజ, హీరోయిన్ ప్రియాభవానిశంకర్ నటిస్తున్న సినిమా షూటింగ్ సీలేరులో సోమవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా స్థానిక మారెమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముహూర్తపు షాట్ తీశారు. ఇంటెక్‌డ్యామ్, చింతపల్లి క్యాంపు సమీపంలో ఉన్న ఎంబెక్‌మెంట్ రెగ్యులేటరీ డ్యామ్ గుంటవాడ జలాశయం వద్ద హీరో రవితేజ, బేబీ నక్షత్రలపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సినిమాలో సాయికుమార్, జగపతిబాబు కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్టు చిత్రయూనిట్ వర్గాలు వెల్లడించాయి. సీలేరులో ఎన్నో ఏళ్ల తరువాత సినిమా షూటింగ్ జరుగుతుండడంతో పరిసర ప్రాంతాల నుంచి భారీగా అభిమానులు తరలి వచ్చారు.


షూటింగ్ స్పాట్‌లో కళాకారులు